చివరి మజిలీకి అన్నీ ఇక్కట్లే

- వైకుంఠధామాల్లో సౌకర్యాలు కరువు
- స్నానాల గదులకు నీటి సరఫరా లేదు
- బోర్ల వద్ద, పొలాల్లోకి వెళ్లి స్నానం చేస్తున్న వైనం
- రాత్రివేళ విద్యుత్ లేక చీకట్లోనే అంత్యక్రియలు


సంగెంలోని వైకుంఠధామం

కోరుట్లరూరల్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామాల్లో సరైన సౌకర్యాలు లేక ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వైకుంఠధామాల్లో నిర్మించిన స్నానాల గదులకు నీటి సరఫరా లేక బయటకు వెళ్లి పంట పొలాల్లో ఏర్పాటు చేసుకున్న బోర్ల వద్ద, పశువుల తొట్ల వద్ద, కాలువల్లో స్నానాలు చేయాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. విద్యుత్ సరఫరా లేక రాత్రివేళల్లో నిర్వహించే అంత్యక్రియలకు తిప్పలు తప్పడం లేదు.

కనీస సౌకర్యాలు కరువు..

మండలంలోని 15 గ్రామాల్లో ప్రభుత్వ స్థలాల్లో ఉపాధిహామీ నిధులతో వైకుంఠధామాలు నిర్మించారు. ప్రతీ వైకుంఠధామంలో కనీసం రెండు బర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లు, స్నానాల గదులు, చుట్టూ ప్రహరీ, సీసీరోడ్డు, ముఖ ద్వారం నిర్మించారు. పలు గ్రామాల్లో నిర్వహణ లోపంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని రెండు, మూడు గ్రామాల్లో తప్ప మిగతా గ్రామాల్లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో అంత్యక్రియల సమయంలో తిప్పలు తప్పడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నీటి సరఫరా లేక..

వైకుంఠధామాల్లో నిర్మించిన స్నానాల గదులకు నీటి సరఫరా లేకపోవటంతో అంత్యక్రియల అనంతరం ప్రజలు స్నానాల కోసం ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు పొలాల్లో ఏర్పాటు చేసిన బోర్లవద్దకు వెళ్లి స్నానాలు చేయటం కష్టతరంగా మారింది. పలు గ్రామాల్లో పశువుల తాగునీటి కోసం నిర్మించిన తొట్లలో, శ్రీరాంసాగర్ కాలువ నీళ్లలో స్నానాలు చేసే పరిస్థితి నెలకొందని వారు వాపోతున్నారు.

చీకట్లోనే అంత్యక్రియలు..

వైకుంఠధామాల నిర్మాణ సమయంలో సోలార్ విద్యుత్ సెట్లు ఏర్పాటు చేసినప్పటికీ వాటి నిర్వహణ సరిగా లేక పనిచేయడం లేదు. దీంతో పలు గ్రామాల్లో రాత్రివేళ అంత్యక్రియలకు అవస్థలు పడాల్సి వస్తోంది. అంతేకాకుండా వర్షాకాలంలో బురదమయంగా మారడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. గ్రామ పంచాయతీలదే నిర్వహణ బాధ్యత అయినప్పటికీ పలు గ్రామాల్లో నిర్వహణా లోపం కారణంగా ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు చొరవ తీసుకొని వైకుంఠధామాలకు విద్యుత్, నీటి సరఫరా సరిగా ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నీటి సౌకర్యం లేదు



అంత్యక్రియల అనంతరం స్నానాలకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. స్నానాల గదులు ఉన్నప్పటికీ నీటి సరఫరా లేదు. ముఖ్యంగా మహిళలు స్నానం చేయడానికి తిప్పలు పడాల్సి వస్తోంది.
– శ్రీరాముల నరేశ్, సంగెం

రాత్రివేళ ఇబ్బందులు



వైకుంఠధామాల్లో విద్యుత్ సరఫరా లేక రాత్రి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గడ్డిలో పాములు, తేళ్లు ఉంటాయేమోనని ప్రజలు భయపడుతున్నారు. వర్షాకాలంలో బురదతో ఇబ్బందిగా ఉంది.
– ఎండీ నసీర్, యూత్ కాంగ్రెస్ నాయకుడు, వెంకటాపూర్

పునరుద్ధరిస్తాం



వైకుంఠధామాలకు విద్యుత్ సరఫరా, నీటి సరఫరా లేని వాటిని గుర్తించి పునరుద్ధరిస్తాం. సరిగా నిర్వహించాలని గ్రామ పంచాయతీలను ఆదేశిస్తాం.
– నీరజ, ఎంపీడీవో

క్లుప్తంగా

అలరించిన స్కూల్ ఫేర్‌వెల్ డే


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

కోరుట్లరూరల్: మండలంలోని వెంకటాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఫేర్‌వెల్ డే బుధవారం వీక్షకులను అలరించింది. గ్రామ శివారులోని వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, సర్పంచ్ తోట శారద లింగారెడ్డి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు హరివరప్రసాద్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం


పనులను పరిశీలిస్తున్న ఎంఈవో భీమయ్య

మల్లాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఈవో భీమయ్య అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని రేగుంట గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఊరు–మన బడి పథకంలో మండలంలోని మొదటి విడతలో ఎంపికైన 14 పాఠశాలల్లో ప్రభుత్వ లక్ష్యం మేరకు త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి అధికారులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమవీరులకు నివాళి


నివాళి అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోరుట్ల: ఎస్సీ వర్గీకరణ కోసం అమరులైన ఎమ్మార్పీఎస్ ఉద్యమ వీరులకు బుధవారం సంస్మరణ దినం సందర్భంగా నివాళి అర్పించారు. జిల్లా కోకన్వీనర్ బలవంతుల సురేశ్, నాయకులు కాశవత్తుల లక్ష్మీరాజం, హన్మంతు, నరేశ్, బుచ్చన్న, రాజం, నరేశ్, ప్రభాకర్, కిరణ్, విజయ్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి


విజయ్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ సంధ్యారాణి

రాయికల్: గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు వృద్ధి సాధించేందుకు లోడి సంస్థ కృషి చేస్తోందని లోడి మానిటరింగ్ ఆఫీసర్ విజయ్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని వస్తాపూర్, చింతలూర్, ఒడ్డెలింగాపూర్, అయోధ్య గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ గ్రామం అభివృద్ధి చెందాలన్నా కేవలం గ్రామ కమిటీల ద్వారానే సాధ్యమన్నారు. ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, లోడి సంస్థ డైరెక్టర్ విజయ్‌పాల్‌రెడ్డి, టెక్నికల్ కోఆర్డినేటర్ అర్జరెడ్డి, నాగేశ్వర్, అర్షారెడ్డి, సర్పంచ్ రవిగౌడ్, లోడి సంస్థ సిబ్బంది శ్రీను, ప్రభాకర్, రవి పాల్గొన్నారు.

కల్యాణం.. నేత్రపర్వం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సారంగాపూర్: దుబ్బరాజన్న ఆలయంలో అనుబంధ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర, అలివేలు మంగ పద్మావతి దేవి ఆలయంలో బుధవారం స్వామివారి, అమ్మవార్ల కల్యాణం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోల జమున, ఈవో కోస్న కాంతారెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్త పొరండ్ల శంకరయ్య, సర్పంచ్ బొడ్డుపల్లి రాజన్న, మాజీ సర్పంచ్ తోడేటి శేఖర్‌గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్ చిత్రపటం దహనం

కథలాపూర్: కథలాపూర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్ చిత్రపటాన్ని బుధవారం దహనం చేశారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు దాడి చేయడాన్ని ఖండించారు. పార్టీ మండల నాయకులు కాయితి నాగరాజు, కాశవత్రి వంశీ, హరిప్రసాద్, లింగంగౌడ్, దనుంజయ్‌రెడ్డి, ఆకుల సంతోష్, అర్జున్, కోట శంకర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి


ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

ధర్మపురి: ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి సునీత డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర పిలుపు మేరకు మూడురోజుల సమ్మెలో భాగంగా బుధవారం ధర్మపురిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు ఎదుట ధర్నా చేపట్టారు. ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కోశాధికారి సునీతతో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జ్యోతి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్కువ వేతనంతో ఎక్కువ పని భారం మోస్తున్న అంగన్‌వాడీలను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని కోరారు. అదేవిధంగా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ సౌకర్యం కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సీడీపీవోకు వినతిపత్రం సమర్పించారు. ప్రాజెక్టు నాయకులు మాధవి, రాజ్యలక్ష్మి, జక్కుల శ్రీదేవి, శంకరమ్మ, కళావతి, భూలక్ష్మి, సుమలత, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మినీ వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు


బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

సారంగాపూర్: మండలంలోని అర్పపల్లి గ్రామ శివారుల్లోని శ్రీమల్లికార్జునస్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి పట్నాలు వేసి, భక్తులు బోనాలు సమర్పించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్వామివారి బోనం ఎత్తుకుని మొక్కులు సమర్పించారు. స్వామివారిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్‌గౌడ్, ఎడమల శైలేందర్‌రెడ్డి, సర్పంచ్ కొండ శ్రీలత దర్శించుకున్నారు.


మొక్కులు చెల్లిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

శ్రీరేణుకా ఎల్లమ్మ పట్నాలు

సారంగాపూర్: మండలంలోని రేచపల్లి గ్రామంలో బుధవారం శ్రీరేణుకా ఎల్లమ్మ పట్నాల కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎల్లమ్మ తల్లి సహిత జమదగ్ని స్వామివారి కల్యాణం–పట్నాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్‌గౌడ్, జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు ఎడమల శైలేందర్‌రెడ్డి, సర్పంచ్ ఎడమల జయ, ఎంపీటీసీ భూక్య లావణ్యరాథోడ్ పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ విగ్రహ ప్రాణప్రతిష్ఠ


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

కోరుట్ల: పట్టణ శివారులోని మాదాపూర్ కాలనీ సమీపంలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ ఆలయంలో బుధవారం విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీశ్రీశ్రీ మధుసుదనానంద సరస్వతి చేతుల మీదుగా యంత్ర స్థాపన, బలిహరణం, పూర్ణాహుతి, ప్రాణప్రతిష్ఠ చేశారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, వైస్ ఎంపీపీ చీటి స్వరూపారాణి, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు అనిల్, రాజేశ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం


పూజల్లో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు దంపతులు

మల్లాపూర్: మండలంలోని రాఘవపేటలో బుధవారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు దేవస్థాన అధ్యక్షుడు, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు–సరోజన దంపతులు హాజరయ్యారు. ఆలయ వార్షికోత్సవాలను 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు సర్పంచ్ నత్తి లావణ్య చెప్పారు. జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, వైస్ ఎంపీపీ గౌరు నాగేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, రైతుబంధు కమిటీ జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య, ఉపసర్పంచ్ ఎండీ.అవినొద్దిన్, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ ఉసికేల రాజేందర్, మాజీ చైర్మన్ గురిజేల లక్ష్మీనారాయణ, స్థానిక నాయకులు రవికుమార్, సిద్ధయ్య పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్

కథలాపూర్: విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కథలాపూర్ ఎస్సై రామచంద్రం అన్నారు. ఈ మేరకు బుధవారం కథలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ గౌసుర్ రహమాన్, లెక్చరర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦'డబుల్' లబ్ధిదారుల ఆందోళన

జగిత్యాల: జిల్లా కేంద్రంలో డబుల్‌బెడ్రూం లబ్ధిదారులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ 3355 మంది అర్హులను గుర్తించి వారికి సంబంధించిన ఆదాయ ధృవీకరణ పత్రాలు ఇవ్వాలని సూచించారు. కానీ కార్యాలయంలో ఒక్క ఆర్ఐ మాత్రమే ఉన్నారని, ఇలా అయితే ధృవీకరణ పత్రాలు ఇవ్వడం ఎలా సాధ్యమవుతుందని అధికారులను ప్రశ్నించారు. సమస్యను వెంటనే పరిష్కరిస్తామని లబ్ధిదారులకు తహసీల్దార్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

✦ఎంపీడీవోను అడ్డుకున్న లబ్ధిదారులు

జగిత్యాలటౌన్: పట్టణంలోని 12వ వార్డులో డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ బుధవారం లబ్ధిదారులు అర్బన్ ఎంపీడీవో వాహనాన్ని అడ్డుకున్నారు. అధికారులు తయారు చేసిన జాబితాలో అనర్హులు ఉన్నారని, అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారించి అర్హులకు డబుల్‌బెడ్రూం ఇల్లు కేటాయించాలని ఎంపీడీవో వాహనం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అక్కడే ఉన్న పోలీసులు నచ్చచెప్పడంతో ఆందోళన విరమించారు.

✦మన ఊరు–మన బడి పనులు ప్రారంభం

కథలాపూర్: మండలంలోని పెగ్గెర్లలో మన ఊరు–మన బడి కార్యక్రమం పనులను నీటిపారుదల శాఖ ఈఈ సంత్ ప్రకాశ్‌రావు బుధవారం ప్రారంభించారు. మన ఊరు–మన బడి పనులకు అప్పట్లో ఎమ్మెల్యే రమేశ్‌బాబు భూమిపూజ చేయగా బుధవారం పనులను ప్రారంభించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ పనులు రూ.44 లక్షలతో చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. డీఈ శ్రీనివాస్, ఏఈ శ్రీధర్, సర్పంచ్ జవిడి ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ భూమయ్య, మాజీ సర్పంచ్ అంజయ్య, వేణు పాల్గొన్నారు.

✦కాంగ్రెస్ గ్రామ అధ్యక్ష పదవికి రాజీనామా

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లికి చెందిన కోట శంకర్ కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు బుధవారం తెలిపారు. ఈ మేరకు మండలాధ్యక్షుడు కాయితి నాగరాజుకు రాజీనామా పత్రం అందించినట్లు చెప్పారు. వ్యక్తిగత కారణాలతోనే పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు ఆయన విలేకరులతో పేర్కొన్నారు.

✦గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు

మల్యాల: మండలంలోని గొల్లపల్లెలో బుధవారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేశారు. మండల పశువైద్యాధికారి ఎలకుర్తి రాజ్‌కుమార్, జూనియర్ వెటర్నరీ అసిస్టెంట్ సురేశ్, లైవ్ స్టాక్ అసిస్టెంట్ అజీజ్, సబార్డినేట్ అహ్మద్ పాల్గొన్నారు.

✦విద్యుత్ ఉద్యోగుల ఆందోళన

మెట్‌పల్లి: రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని డివిజన్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు బుధవారం ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన చేశారు. ఇప్పటికైనా పీఆర్సీ అమలుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

✦మార్కెట్ కమిటీ అభివృద్ధికి సహకరించాలి

ధర్మపురి: వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి సహకరించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అయ్యోరి రాజేశ్ కోరారు. మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం పాలకవర్గ సాధారణ సమావేశం ఏర్పాటు చేశారు. 2022 డిసెంబర్ 1 నుంచి 2023 ఫిబ్రవరి వరకు ఉన్న ఆదాయ వ్యయాలు, 2023–2024 బడ్జెట్ అంచనాల ప్రతిపాదనలపై చర్చించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు అక్కెనపెల్లి సునీల్‌కుమార్, పాలకవర్గ సభ్యులు రాజమల్లయ్య, మల్లేశం, వెంకటి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు


బిందెల్లో నీటిని తీసుకెళ్తున్న భక్తులు

కథలాపూర్: మండలంలోని చింతకుంటలో మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. అనంతరం బిందెలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి విగ్రహాలకు అభిషేకం చేశారు.

అటెన్షన్ ప్లీజ్



మురుగు.. ఎన్నాళ్లకు తొలుగును?

మెట్‌పల్లి: ఇది పట్టణంలోని బస్‌స్టేషన్ అవుట్ గేట్ పక్కన డ్రైనేజీలో నిలిచిన మురుగు నీరు. జాతీయ రహదారికి ఇరువైపులా కొత్తగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. అయితే అవుట్ గేట్ దగ్గర పనులు పూర్తి చేయలేదు. దీంతో మురుగు నీరు దిగువకు పోకుండా అక్కడే నిలుస్తోంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారి పేరు : రత్నాకర్, శానిటేషన్ ఇన్‌చార్జి
ఫోన్ నంబర్ : 79950 14919

రాత్రి బస.. ఉదయం పూట పర్యటన


ప్రజాప్రతినిధులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాలఅగ్రికల్చర్: 'మీరు–నేను' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల వద్దకు వెళ్తున్నారు. అదే గ్రామంలో రాత్రి బస చేసి, మరుసటి రోజు ఉదయం గ్రామంలోని కాలనీల్లో తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడ గ్రామంలో మంగళవారం రాత్రి బస చేసి, బుధవారం కల్లెడ, సోమన్‌పల్లి గ్రామాల్లో పర్యటించారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, హోటళ్లలో చాయ్ తాగుతూ, టిఫిన్ చేస్తూ, కాలినడకన వీధులన్నీ తిరిగారు. ఈ సందర్భంగా గ్రామంలో మంజూరైన సీసీరోడ్లకు శంకుస్థాపన చేశారు. మరోవైపు కల్యాణలక్ష్మి కింద మంజూరైన చెక్కులను ఆడబిడ్డలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

జగిత్యాలజోన్: నియోజకవర్గ అభివృద్ధికి రాత్రింబవళ్లు కృషి చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పనితీరుకు ఆకర్షితులై పలు పార్టీలకు చెందిన నాయకులు బుధవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపల్లి మాజీ సర్పంచ్ ఏదుగుల రాధ, బీజేపీకి చెందిన మాజీ వార్డు సభ్యులు నరేశ్, గంగాధర్‌తో పాటు వారి అనుచరులు దాదాపు 100 మంది బీఆర్ఎస్‌లో చేరారు. కాగా ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజేంద్రప్రసాద్, మార్కెట్ చైర్మన్ నక్కల రాధ, సింగిల్‌విండో చైర్మన్ సందీప్‌రావు, సర్పంచ్ జయపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ విక్రమ్, మార్కెట్ మాజీ చైర్మన్ దశరథరెడ్డి పాల్గొన్నారు.

జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల: విద్యార్థులు జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ సూచించారు. ఈ మేరకు బుధవారం ఎస్ఎస్‌వీ, రామకృష్ణ డిగ్రీ కళాశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఆయన మాట్లాడారు. కళాశాల యజమాన్యం ఇలాంటి జాబ్‌మేళాలు నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం అభినందనీయమని కొనియాడారు. ప్రిన్సిపాళ్లు రాజేందర్, వెంకటరమేశ్ ఉన్నారు.

పేదల ఆత్మీయ బంధువు సీఎం కేసీఆర్


చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

మల్లాపూర్: పేదల ఆత్మీయ బంధువు సీఎం కేసీఆర్ అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరుట్ల నియోజకవర్గంలోనే ప్రభుత్వం రూ.17కోట్ల పెన్షన్లు అందిస్తోందన్నారు. అనంతరం 50మంది లబ్ధిదారులకు రూ.50.05లక్షల విలువగల చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గౌరు నాగేష్, రైతుబంధు కమిటీ జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య, మండల అధ్యక్షుడు కొమ్ముల జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు బండి లింగస్వామి, సీనియర్ నాయకులు కాటిపెల్లి ఆదిరెడ్డి, క్యాతం జీవన్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపసర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కోరుట్ల: పట్టణానికి చెందిన కటుకం రాకేశ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. మండలంలోని పైడిమడుగు గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అట్ల కార్తీక్ గోవాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల సంజయ్ బుధవారం పరామర్శించారు. రాకేశ్ భార్య మాళవికకు రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ గడ్డమీది పవన్, సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, కౌన్సిలర్ జిందం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

భైరి నరేశ్‌పై పీడీ యాక్ట్ నమోదు చేయాలి

రాయికల్: నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు భైరి నరేశ్, రేంజర్ల రాజేశ్ హిందూ దేవుళ్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా వారిపై వెంటనే పీడీ యాక్ట్ కేసు నమోదు చేయాలని కోరుతూ బుధవారం విశ్వహిందూ పరిషత్ సభ్యులు బుధవారం ఎస్సై కిరణ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. విశ్వహిందూ పరిషత్ గోరక్ష ప్రముఖ్ కాయితి గంగాధర్, మనోహరచారి, మధు, సతీశ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో..

గొల్లపల్లి: హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడుతున్న భైరి నరేశ్‌పై పీడీయాక్టు కేసు నమోదు చేయాలని గొల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. మండల అధ్యక్షుడు కుంబార్ కార్ అరుణ్, కార్యదర్శి ఆవుల వెంకటేశ్‌యాదవ్, నగర అధ్యక్షుడు ఆడెపు నరేశ్, మాటూరి విజయ్, అంకం రవి, రాజేందర్, బజరంగ్‌దల్ కన్వీనర్ ఉమేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

మెడికో విద్యార్థిని ప్రీతికి నివాళి


నివాళి అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు

మల్లాపూర్: మెడికో విద్యార్థిని ప్రీతికి మండల కేంద్రంతో పాటు చిట్టాపూర్‌లో బుధవారం ప్రజాప్రతినిధులు, యువకులు, గ్రామస్తులు నివాళి అర్పించారు. కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి ప్రధాన కూడళ్ల వద్ద నివాళి అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కడకుంట్ల సాయికుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్, తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర రమేశ్, సామాజిక కార్యకర్త విష్ణువర్ధన్ రాజు, నాయకులు పెద్దిరెడ్డి లక్ష్మణ్, కాశవత్తుల శ్రీనివాస్, ఎర్ర రాజు పాల్గొన్నారు.